క్లుప్తంగా

బాలింతలకు ఇంటి వద్దే ఆరోగ్యసేవలందించాలి



మందులు పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): పసి పిల్లలు, బాలింతలకు ఇంటి వద్దే ఆరోగ్యసేవలందించి వివరాలను స్మార్ట్‌ఫోన్‌లో ఈ–ఆశా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన కల్లూరు పీహెచ్‌సీ ఆశాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, 16 ఏళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు ఇచ్చి వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఏఎన్‌ఎంలు ఆరోగ్యసేవలను కూడా సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. లింగ వివక్షత నిర్మూలన, గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం, ఆడపిల్లల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

పవిత్ర అక్షింతలకు భవ్య స్వాగతం

కర్నూలు కల్చరల్: అయోధ్యలో భవ్య రామ మందిర నిర్మాణం పూర్తి కాబోతున్న సందర్భంగా భగవాన్ శ్రీరామ్ లల్లా విరాజ్ మాన్ వేద మంత్రాలతో పూజించిన పవిత్ర అక్షింతలు రాష్ట్రంలోని హిందూ బంధువులందరికీ చేర్చనున్నట్లు వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి తెలిపారు. పవిత్ర అక్షింతలు 8వ తేదీ రాత్రి 12 గంటలకు గోరఖ్ పూర్ ఎక్స్‌ప్రెస్‌లో కర్నూలుకు తీసుకొస్తున్నట్లు చెప్పారు. భవ్య స్వాగతం పలికేందుకు హిందూ బంధువులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు బుధవారం రాత్రి 11.30 గంటలకు కర్నూలు రైల్వే స్టేషన్‌కు చేరుకోవాలని కోరారు.

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడిగా శ్రీనివాసులునాయుడు



నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాసులునాయుడు

కర్నూలు(అర్బన్): సమాజ్‌వాదీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బి.శ్రీనివాసులునాయుడు నియమితులయ్యారు. మంగళవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో శ్రీనివాసులునాయుడుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు నియామకపత్రం అందించారు. సోషలిస్టు థింకర్స్ ఫోరం అధ్యక్షులు బొట్టు మధుయాదవ్, పార్టీ పశ్చిమ రాయలసీమ కోఆర్డినేటర్ పాండురంగయాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు కార్తీక్ రాజు, మహిళా నేత ఫరీదాబీ, ములాయం బ్రిగేడ్ అధ్యక్షులు కళ్యాణ్ హాజరయ్యారు.

వికలాంగులకు వీల్‌చైర్ల విరాళం

కర్నూలు(హాస్పిటల్): దాత మండడి రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు లయన్స్ క్లబ్ పూర్వ రీజినల్ చైర్మన్ రేగటి పాండురంగారెడ్డి చేతుల మీదుగా మంగళవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న రామ్ హెల్త్‌క్లినిక్‌లో పారుమంచాల గ్రామానికి చెందిన ఇద్దరు వికలాంగులకు వీల్‌చైర్లు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏఎస్ఐ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు దేవదాయ శాఖ కమిషనర్ రాక

కర్నూలు కల్చరల్: దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఈనెల 9న కర్నూలు రానున్నట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.రామాంజనేయులు తెలిపారు. ఉదయం 10 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్, ఆర్‌జేసీ ఎస్‌వీఎస్ మూర్తి, కర్నూలు జోన్ డిప్యూటీ కమీషనర్ పట్టెం గురుప్రసాద్‌తో కలిసి రాయలసీమ జిల్లాల అసిస్టెంట్ కమిషనర్లు, ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, మండల ఇన్‌చార్జ్‌లతో రాయలసీమలో దేవదాయ శాఖ భూములు, ఆలయాల ఆస్తుల పరిరక్షణపై సమీక్ష చేయనున్నారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు రాయలసీమ జిల్లాల్లోని అర్చకుల సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కారానికి మార్గదర్శనం చేస్తారని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయండి

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీని గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్ మస్తాన్‌వలి శ్రేణులను ఆదేశించారు. మంగళవారం కళావెంకట్రావ్ భవన్‌లో నూతన డీసీసీ అధ్యక్షుడిగా కె.బాబురావు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అనువైన మార్గాలు ఉన్నాయన్నారు. డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి డీసీసీ అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించిన కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీని సమర్థవంతంగా నడిపేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

మహానగరంగా తీర్చిదిద్దుతున్నాం

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- రూ.కోట్లు వెచ్చించి కర్నూలు నగరంలో శాశ్వత అభివృద్ధి పనులు
- కర్నూలు, పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల అభివృద్ధిపై సుదీర్ఘ చర్చ



మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న మూడు నియోజకవర్గాల అధికారులు

కర్నూలు (టౌన్): మహా నగరంగా కర్నూలును తీర్చిదిద్దుతున్నామని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. రూ.కోట్ల నిధులు వెచ్చించి శాశ్వతమైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. మంగళవారం సాయంత్రం నగరపాలక కౌన్సిల్ హాల్‌లో కర్నూలు, పాణ్యం, కోడుమూరు నియోజకవర్గ స్థాయి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎమ్మెల్యేలు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో మంత్రి సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. మూడున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో మూడు నియోజకవర్గాల్లో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగర శివారులోని టిడ్కో గృహాల్లో నివసిస్తున్న కుటుంబాల కోసం రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేసి, బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే టిడ్కో గృహాల వద్ద ఆఫీసు ఏర్పాటు చేసి లబ్ధిదారులు ఇళ్లు చూసేందుకు వచ్చినప్పుడు ఏ బ్లాకులో ఏ ఇల్లు ఉందన్న వివరాలను తెలియజేసే విధంగా చర్యటు తీసుకోవాలని టిడ్కో ఎస్ఈని ఆదేశించారు. టీవీ–9 కాలనీకి సంబంధించి 2009 వరదల సమయంలో 1,250 ఇళ్లు ఇవ్వడం జరిగిందని, అయితే అక్కడ లబ్ధిదారులు లేరని కోడుమూరు ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ గృహాల కింద 1, 2 దశల్లో 8,447 గృహాలు జగన్నాథ గట్టు వద్ద 2007 నుంచి 2009 వరకు లబ్ధిదారులకు కేటాయించడం జరిగిందని మంత్రి చెప్పారు. అక్కడ మురుగునీటి వ్యవస్థ, నీటి సదుపాయం, శానిటేషన్ పనులు చేపట్టేందుకు అంచనాలను రూపొందించి తనకు సమర్పించాలని హౌసింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. ఎమ్మిగనూరులోని టిడ్కో ఇళ్ల పురోగతి గురించి ఆరా తీశారు.

కరెంట్ సమస్యను పరిష్కరించాలి

ఓల్డ్ టౌన్‌లోని కరెంట్ సమస్యను పరిష్కరించాలి ఓల్డ్ టౌన్‌లో సమస్యగా ఉన్న కరెంట్ సప్లయ్ వైర్లను త్వరితగతిన మార్చేందుకు చర్యలు చేపట్టాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మంత్రిని కోరారు. టిడ్కో గృహాల వద్ద పోలీస్ ఔట్ పోస్టు, స్కూల్ ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ టాయిలెట్స్‌కు సంబంధించి లేబర్ లేకపోవడంతో నిర్వహణ సక్రమంగా లేదని సమావేశం దృష్టికి తెచ్చారు. నగరంలోని పండ్లు, చేపల మార్కెట్లకు అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో అనువైన స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. క్రైస్తవ, ముస్లిం శ్మశాన వాటికలకు కూడా అనువైన స్థలాలను ఇవ్వాన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గ పరిధిలోని 16 వార్డుల్లో తాగునీటిని రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారని, ప్రతిరోజూ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. పాత కల్లూరు వక్కెర వాగు వద్ద కొత్త బ్రిడ్జి మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఓర్వకల్లు, తిప్పాయి పల్లె గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, అలాగే పందిపాడు లే అవుట్‌కి సంబంధించి హౌస్ సైట్స్, కర్నూలు కార్పొరేషన్ పరిధిలో ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 21వ వార్డు మహాలక్ష్మీ నగర్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలన్నారు. కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కాటసాని మంత్రిని కోరారు.

స్థలం చూపించాల్సి ఉంది

కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ బి.తాండ్రపాడు ప్రజలకు 277 సర్వే నంబర్‌లోని 39 ఎకరాల్లో 1,400 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చామని, అయితే వారికి స్థలం చూపించాల్సి ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. గాజులదిన్నె, సుంకేసుల నుంచి కర్నూలు నగరానికి తాగునీటి సరఫరా చేస్తున్నారని, అలాగే కోడుమూరు నియోజకవర్గానికి తుంగభద్ర డ్యామ్ నుంచి నీరు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తెచ్చారు. నిడ్జూరు గ్రామంలో అందరికీ ఇళ్ల పట్టాలు అందించామని, అయితే రెండవ వార్డు బీసీ కాలనీలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. తుంగభద్ర పరివాహక ప్రాంతంలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, సుంకేసుల నుంచి లింగాలదొడ్డి వరకు రహదారి నిర్మాణం, రేమట గ్రామంలో కిలోమీటర్ మేర పెండింగ్‌లో ఉన్న రహదారిని పూర్తి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆర్‌డీఓ హరిప్రసాద్, నగరపాలక కమిషనర్ భార్గవతేజ పాల్గొన్నారు.

స్పాట్ బిల్లింగ్ రెండు రోజుల్లో పూర్తి కావాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారులకు స్పాట్ బిల్లింగ్ ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. మంగళవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇల్లు, షాపుల వద్ద ఉన్న మీటర్ వద్దకు వెళ్లి, బిల్లింగ్ స్కానర్‌తో ప్రతి డిజిటల్ మీటర్‌ను స్కాన్ చేసి రీడింగ్ తీయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. స్కాన్ కాకపోవడం, వాడిన యూనిట్ల కంటే రీడింగ్ హెచ్చు తగ్గులు రావడం వంటి సమస్యలు తలెత్తితే రీడర్లు వెంటనే ఏఈల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలన్నారు.

19న డాక్టర్జీ స్ఫూర్తి మందిరం ప్రారంభోత్సవం

కర్నూలు కల్చరల్: వికాస భారతి ఆధ్వర్యంలో ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ సమీపంలోని సురభి గోశాల ప్రాంగణంలో ఈనెల 19న డాక్టర్జీ స్ఫూర్తి మందిరం ప్రారంభోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఛత్రపతి శివాజీ, ఝాన్సీ లక్ష్మీబాయి, మహారాణా ప్రతాప్, సర్దార్ వల్లభాయ్ పటేల్, అల్లూరి సీతారామరాజు విగ్రహాల ఆవిష్కరణ ఉంటుందన్నారు. అదే రోజు కార్తీక వన భోజన కార్య క్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వికాస భారతి సంఘటనా కార్యదర్శి నాగేంద్రప్రసాద్, విశ్వహిందూ పరిషత్ న్యూఢిల్లీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి కప్పగంతుల కోటేశ్వరశర్మ ప్రధాన వక్తలుగా హాజరవుతారన్నారు. వైఎస్సార్ కడప జిల్లా తోటపల్లి బ్రహ్మంగారి మఠం అచలానంద ఆశ్రమం విరజానంద స్వామి ఆశీర్వాద ప్రసంగం ఉంటుందన్నారు. వికాస భారతి, సురభి గోశాల సభ్యులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఈ-హాస్పిటల్ పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అన్ని విభాగాల వైద్యులు ఈ–హాస్పిటల్‌ను పక్కాగా నిర్వహించాలని సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సూచించారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–హాస్పిటల్ నిర్వహణలో యురాలజీ, జనరల్ సర్జరీ, పల్మనరి మెడిసిన్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సైకియాట్రి, ఆర్థోపెడిక్ విభాగాలు బాగా పనిచేస్తున్నాయని, ఇతర విభాగాలు సైతం ఇదే రీతిలో ముందుకు సాగాలన్నారు. ఆసుపత్రిలో కొందరు వైద్యులు అవసరం లేకపోయినా ఎంఆర్ఐ, సీటీ స్కాన్ పరీక్షలు రాస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వానికి భారం అవుతుందన్నారు. అవసరం ఉన్న వారికి ఆసుపత్రిలో చేర్చుకుని మాత్రమే ఈ పరీక్షలు చేయించాలని ఆదేశించారు. అనవసరంగా వైద్యపరీక్షలు చేయిస్తే విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆయా విభాగాల్లో పారిశుధ్యం, సెక్యూరిటీ నిర్వహణ బాధ్యత ఆయా విభాగాల హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లపై ఉందన్నారు. సమావేశంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకటతులశమ్మ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రేమట విద్యార్థులు



విద్యార్థులతో హెచ్ఎం దాదాపీర్

కర్నూలు సిటీ: మండల పరిధిలోని రేమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను పీఈటీ కె.పరమేష్‌తో కలిసి హెచ్ఎం దాదాపీర్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్–17 సాఫ్ట్ బాల్‌లో జి.విష్ణు, అండర్–17 స్విమ్మింగ్‌లో ఎ.విక్రమ్,ఎం.కళ్యాణ్, ఎం.మహేష్, అండర్–14 స్విమ్మింగ్‌లో ఎస్.కంగల్‌బాషా ప్రతిభ కనబరిచి బుధవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం విద్యార్థులను తిరుపతికి సాగనంపారు.

పారదర్శకంగా ఓటరు ముసాయిదా జాబితా

- కమిసనర్ భార్గవ్‌తేజ



మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): ఓటరు ముసాయిదా జాబితాను పారదర్శకంగా రూపొందిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో కమిషనర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏవైనా ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కాగా ఓటరు జాబితాలోని మరణాలు, వలసలు పునరావృతమైన ఓట్లు, మార్పులు, చేర్పుల వంటి అంశాలపై రాజకీయ పార్టీల నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నగరపాలక డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ విజయశ్రీ, ఎలక్షన్ డీటీ ధనుంజయ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎమ్మెల్సీ బీటీ నాయుడు, టీజీ భరత్, నయూమ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పలు చోట్ల వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో మంగళవారం సా యంత్రం 6 గంటల సమయంలో కర్నూలు, క్రిష్ణగిరి, హలహర్వి, హొలగొంద, సి.బెళగల్, ఆదోని తదితర మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. క్రిష్ణగిరిలో దాదాపు 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్నూలు అర్బన్‌లో కూడా భారీ వర్షం (25.6 మి.మీ) కురిసింది. హాలహర్వి మండలం విరూపాపురం గ్రామంలో 18, హొళగుంద మండలం సులువాయి గ్రామంలో 14.5, సీ.బెళగల్ మండలం కొత్తకోటలో 13.5, ఆదోనిలో 13.0 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. ఆయా ప్రాంతాల్లో ఈ నెల 15 వరకు శనగ సాగు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. కాగా అల్పపీడన ప్రభావంతో రానున్న 5 రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్): ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో కేంద్ర కార్మిక, రైతు సంఘాలు తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య కోరారు. మంగళవారం ఎస్టీయూ భవన్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు, పీఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలోనూ, స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయడంలోనూ కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశ ప్రజల ఆదాయం పెంచుతానన్న మోదీ.. పేదలను మరింత పేదలుగా మార్చేశారని విమర్శించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. సదస్సులో నాయకులు అంజిబాబు, కె.రామకృష్ణ, నాగన్న పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు అడ్మిషన్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సరళ చిత్రంలో ప్రిన్సిపాల్ శాంతి దమయంతి

కర్నూలు (హాస్పిటల్): పారా మెడికల్ నర్సింగ్ కోర్సులకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు అమీలియో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అలైడ్ హెల్త్ కేర్ సైన్సెస్ చైర్‌పర్సన్ సరళ, ప్రిన్సిపాల్ శాంతి దమయంతి తెలిపారు. మంగళవారం సాయంత్రం అమీలియో హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం పారా మెడికల్, నర్సింగ్ కళాశాలను నూతనంగా ప్రారంభించామన్నారు. ఇందులో బీపీ, డీఎంపీహెచ్‌ఏ, డీఎంఎల్‌టీ, డీఎంఐటీ, డీఆర్‌జీఏ, డీఎంఎస్‌టీ, డీఏఎన్ఎస్, డీసీఎల్‌టీ, డీఆర్‌పీటీ, డీఓఎం, డీఓఏ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 10వ తేదీలోపు ప్రవేశం పొందాలన్నారు. మేనేజ్‌మెంట్ కోటా వారు 17వ తేదీలోపు ప్రవేశం పొందాలన్నారు.

ఐటీ ఉద్యోగాలపై అవగాహన

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో మంగళవారం ఫార్మా కంపెనీల్లో ఐటీ ఉద్యోగ అవకాశాలపై కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫార్మసీ పూర్తి చేసిన వారికి సైతం మంచి ప్యాకేజీలతో ఐటీ ఉద్యోగాలు ఉన్నాయన్నారు. మెయిన్ స్ప్రింగ్స్ సీఈఓ బసప్ప మాట్లాడుతూ ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థల బంద్

కర్నూలు కల్చరల్: కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలనే డిమాండ్లతో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఏలు బుధవారం విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్‌కు అందరూ సహకరించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. విద్యార్థి సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ చేపడుతుండటంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ముందస్తు సెలవును ప్రకటించాయి.

కర్నూలు చేరుకున్న పురంధేశ్వరి

కర్నూలు కల్చరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురంధేశ్వరి మంగళవారం రాత్రి కర్నూలు చేరుకున్నారు. నగరానికి వచ్చిన ఆమెకు బీజేపీ, కమ్మ సంఘ నాయకులు స్వాగతం పలికారు. కేంద్ర సహాయ మంత్రి చౌహాన్‌తో కలిసి పురంధేశ్వరి బుధవారం ట్రిపుల్ ఐటీ డీఎమ్‌ను సందర్శిస్తారు. అనంతరం కోడుమూరులో నిర్వహించే జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొంటారు.

పుట్టుకతో లోపాలున్న వారికి ఉచిత చికిత్స



పిల్లలకు వచ్చే వ్యాధుల గురించి వివరిస్తున్న హేమలత

కర్నూలు(హాస్పిటల్): లోపాలతో జన్మించిన చిన్నారులకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డిస్ట్రిక్ట్ అర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డైస్)లో ఉచితంగా చికిత్స చేస్తారని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ హేమలత తెలిపారు. మంగళవారం ముజఫర్‌నగర్ యూపీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లలోపు పిల్లల్లో డీ ఫార్మిటీ, డిఫిషియన్స్, చైల్డ్ హుడ్ డీసీజెస్, డెవలప్‌మెంట్ డిలే(4డీ), వైకల్యం, పుట్టుకతో లోపాలు, పోషకాహార లోపాలు, సరిగ్గా మాట్లాడలేకపోవడం, మానసిక అభివృద్ధిలో లోపాలున్న పిల్లలను క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి వారికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో ఉన్న ఓపీ నెం.43లో(డైస్)లో తగిన వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు, వైద్య, శస్త్రచికిత్సల గురించి వివరిస్తారన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, సామాజిక ఆరోగ్య అధికారులు, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పిల్లల్లో వచ్చే నాలుగు రకాల లోపాలున్న ఇలాంటి పిల్లలను గుర్తించి సంబంధిత వైద్యాధికారులతో డైస్ కేంద్రానికి రెఫర్ చేయించాలన్నారు. సమావేశంలో ప్రాజెక్షనిస్టు ఖలీల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీవీ రామన్ జయంతి వేడుకలు

కర్నూలు సిటీ: స్థానిక మాధవీనగర్, రెవెన్యూ కాలనీల్లోని రవీంద్ర ఇంగ్లీషు మీడియం హైస్కూల్, రవీంద్ర టాలెంట్ స్కూళ్లలో మంగళవారం సీవీ రామన్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్కూళ్ల కరస్పాండెంట్ పి.బి.వి సుబ్బయ్య పాల్గొని సీవీ రామన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన, ఒలంపియాడ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య

శిశు సంరక్షణ కేంద్రం సందర్శించిన న్యాయమూర్తి



శిశు గృహాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి

కర్నూలు (లీగల్): స్థానిక బి.క్యాంప్‌లోని శిశు గృహాన్ని మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు పరిశీలించారు. శిశువుల రక్షణ, నవజాత శిశువుల పట్ల సంరక్షణ, జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యాలయానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడ ఉన్న పిల్లలకు అవసరమైతే ఉచిత న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో శిశు గృహం మేనేజర్ పాల్గొన్నారు.

అప్రెంటిషిప్‌కు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థలో అప్రెంటిషిప్ చేసేందుకు ఐటీఐ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు–2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, వెల్డర్, మోటార్ మెకానిక్, పెయింటర్, డీజిల్ మెకానిక్, మిషనిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ విభాగాల్లో ఖాళీగా ఉన్నాయని, ఆయా విభాగాల్లో ఐటీఐ పూర్తి చేసిన వారు అప్రెంటిషిప్ ఇండియా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 7382869399, 7382873146 సంప్రదించాలని కోరారు.

ఫిర్యాదులపై స్పందించండి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై.సుబ్బన్న సూచించారు. మంగళవారం ఆయన స్థానిక పవర్ హౌస్‌లోని తన కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరాయం, సమస్యల ఫిర్యాదులు వస్తే ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బంది రికార్డులో నమోదు చేసుకుని, పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

కర్నూలు (హాస్పిటల్): క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్ విహారి, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రాఘవేందర్ రెడ్డి సూచించారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ రావడానికి కారణాలు, లక్షణాలు, నివారణ, చికిత్స గురించి వివరించారు. దేశంలో ఏడు రకాల క్యాన్సర్లతో ప్రజలు ఎక్కువగా బాధ పడుతున్నారని, వాటిలో ఊపిరితిత్తులు, రొమ్ము, నోరు, గర్భాశయ, కడుపు, అన్నవాహిక, కాలేయ క్యాన్సర్లు ఉన్నాయన్నారు. కొన్ని జాగ్రత్తలతో ఈ క్యాన్సర్లకు దూరంగా ఉండవచ్చన్నారు. ఒక్కసారి క్యాన్సర్ వస్తే నిరంతరం అనారోగ్యంతో పోరాడాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ సెంటర్ హెడ్ నీలా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

16న వ్యాసరచన పోటీలు

కర్నూలు(హాస్పిటల్): గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం –1994పై సిటీ స్థాయి వ్యాసరచన పోటీలు ఈనెల 16న నిర్వహించనున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆర్‌డీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. 11 నుంచి 14ఏళ్లలోపు వారిని జూనియర్స్‌గా, 14 ఏళ్లు పైబడిన వారిని సీనియర్స్‌గా పరిగణిస్తామన్నారు. వివరాలకు వెంకటరమణ కాలనీలోని మొదటి లైన్‌లో ఉన్న నైస్ కంప్యూటర్ కార్యాలయంలో ఈనెల 11వ తేదీ లోపు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో మాస్ మీడియా అధికారిణి ప్రమీలాదేవి, డిప్యూటీ మాస్ మీడియా అధికారి చంద్రశేఖర్, లయన్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్, అడ్వకేట్ సుమలత, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసులు, జేజేబీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగముని, రెండవ పట్టణ ఎస్ఐ ఎం.ఎ.ఖాన్, గైనకాలజిస్ట్ నర్మద పాల్గొన్నారు.